క్లుప్తంగా

పేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించాలి

సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు



తెనాలిఅర్బన్: పట్టణంలో నిరుపేదలకు రెండు సెంట్ల స్థలాన్ని కేటాయించి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు విడుదల చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లో సోమవారం ఇంటి స్థలాల అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో ఇల్లులేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వెంటనే దానిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పరుచూరి వెంకటేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, రాజేష్, తేజ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 23వ వార్డు శాంతినగర్‌లో సోమవారం ఆమె పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ప్రధాన మురుగు కాల్వలోల జరుగుతున్న గ్యాంగ్ వర్క్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం



మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ఆదివారం రాత్రి మల్లేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి వార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ దేవరాయ కాపు కమిటీ ఆధ్వర్యంలో ఒకే వాహనంపై ఇరువురు స్వామి వార్ల అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు దర్శించుకుని టెంకాయలు కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



మంగళగిరి టౌన్: కౌలు రైతులకు గుర్తింపు కార్డులతో పాటు పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ కౌలు రైతు, రైతు సంఘాల మంగళగిరి రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి తహసీల్దార్ దినేష్ చంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరలు ప్రకటించాలని, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, పెసర పంటకు గిట్టుబాటు ధర 1 క్వింటాకు రూ.8 వేలు నిర్ణయించాలని పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధిలో అనేక గ్రామాల్లో వివిధ రకాల పంటలు పూతలకు వస్తున్నాయని, వాటిని గిట్టుబాటు ధరలు లేక తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతు సంఘం జిల్లా నాయకుడు పాశం రామారావు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకుడు మాధవరెడ్డి, భీమిరెడ్డి కోటేశ్వరి, శివారెడ్డి, అప్పారావు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం

తెనాలిరూరల్: ఇంటి నుంచి వెళ్లిన ఆటో డ్రైవర్ అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ యడ్ల లింగయ్య కాలనీకి చెందిన 32 ఏళ్ల బుడ్డుల వెంకటేష్ టాటా ఏస్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గత నెల 31వ తేదీ తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ ఏఎస్‌ఐ హైదర్ అలీ కేసు సోమవారం నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవమి వేడుకల్లో పాదుకా పట్టాభిషేకం

తెనాలి: శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నవమి రోజున వివిధ దేవాలయాల్లో జరిపిన శ్రీసీతారాముల కల్యాణోత్సవం అనంతరం సోమవారం పట్టాభిషేక మహోత్సవాలను నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీహనుమాన్‌చౌకలో గల శ్రీసీతారామమందిరంలో 93వ వార్షిక వసంత నవరాత్ర వేడుకల్లో భాగంగా పాదుకా పట్టాభిషేకాన్ని అర్చకులు ఘనంగా జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవస్థానంలో ఉదయం నిత్య బలిహరణ, తదుపరి శ్రీశేష వాహనంపై స్వామివార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా జరిపారు. సాయంత్రం స్వామివార్ల దివ్య రథోత్సవం నిర్వహించారు. ఏడు గంటల్నుంచి తెనాలికి చెందిన కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్యగురువు డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి, ఆమె శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించారు. స్థానిక మారీస్‌పేటలోని శ్రీకోదండరామస్వామి దేవస్థానం (అప్పలస్వామి గుడి)లో నవమి వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీసీతారాముల గ్రామోత్సవాన్ని జరిపారు. రూరల్ మండల గ్రామం అంగలకుదురులోని శ్రీకోదండరామ సేవక ధర్మ సమాజం (దాసకుటి)లో శ్రీరామనవమి వేడుకల్లో శ్రీస్వామివారికి పట్టాభిషేకం జరిపారు. ఆశ్రమ ఆరో పీఠాధిపతి శ్రీసీతారామదాసు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ సీతారామ మందిరంలో పాదుకా పట్టాభిషేకం చేస్తున్న భక్తులు

వ్యక్తిగత రుణాలు సద్వినియోగం చేసుకోండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: ప్రభుత్వం అందించే వ్యక్తిగత రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న సూచించారు. కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో వ్యక్తిగత రుణాలను సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలనను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఈడబ్ల్యుఎస్, కాపు సామాజిక వర్గాల నిరుద్యోగులకు సబ్సిడీపై వ్యక్తిగత రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం సర్టిఫికెట్ల పరిశీలన జరిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, 27వ వార్డు కౌన్సిలర్ బోయపాటి అరుణ, మెప్మా సీఎంఎం విజయ, ఆర్‌వో రాంప్రసాద్, డీఈ సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

సమాధుల తోటను శుభ్రం చేయండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలోని అన్ని క్రైస్తవ సమాధుల తోటలను శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఐతానగర్‌లోని సమాధుల తోటను సోమవారం ఆయన పరిశీలించారు. ఆ ప్రాంతంలో పిచ్చి చెట్లు మొలచి ఇబ్బందికరంగా ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్టర్ రోజున క్రైస్తవులు తమ పూర్వీకులను స్మరించుకుంటారని తెలిపారు. వారికి ఎటువంటి ఆటంకాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

హద్దుమీరుతున్న వెబ్‌సిరీస్‌లపై కత్తెర పడాలి

మా–ఏపీ అధ్యక్షుడు, కేంద్ర సెన్సారుబోర్డు మాజీ సభ్యుడు దిలీప్‌రాజా

తెనాలి: ఓటీటీల్లో ప్రసారమయ్యే వెబ్‌సిరీస్, సినిమాలకు విధిగా సెన్సార్ చేసి, అశ్లీల సన్నివేశాలను అడ్డుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర సెన్సారు బోర్డు మాజీ సభ్యుడు, మా–ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా అభిప్రాయపడ్డారు. మా–ఏపీ కార్యాలయంలో సోమ వారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటీటీ ప్లాట్‌పాంలపై కొన్ని వెబ్‌సిరీస్, సినిమాల్లో హద్దుమీరిన శృంగారం యువతరంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై కేంద్ర సమాచారశాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్‌కు మా–ఏపీ తరపున పలు విజ్ఞాపనలు చేసినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 18 ఓటీటీ ప్లాట్‌పాంలను నిషేధించినప్పటికీ అశ్లీల వెబ్‌సిరీస్‌లు వస్తూనే ఉన్నాయని, సెన్సారు కత్తెరతోనే వీటికి అడ్డుకట్ట వేయగలరన్నారు. దీనికి తోడు సెల్‌ఫోన్‌తో అందుబాటులో ఉన్న పోర్న్ సైట్లను నిషేధించాలని కూడా నాటి కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అరుణ్‌జైట్లీని కలిసి విన్నవించినట్టు గుర్తుచేసుకున్నారు. ఇప్పటికైనా భారతదేశంలో పోర్న్ సైట్లను నిషేధించాలని, ఓటీటీ ప్రసారాలకు సెన్సార్‌షిప్ విధించాలని విజ్ఞప్తిచేశారు. ఈమేరకు మా–ఏపీ తరపున కేంద్ర ప్రభుత్వానికి లేఖ పంపుతున్నామని వివరించారు. వీరితో వర్ధమాన దర్శకుడు మణివరన్ ఉన్నారు.



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

మంగళగిరి: రైతులు పండించే పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.భారతి డిమాండ్ చేశారు. నగర పరిధిలోని కాజలో సోమవారం రైతు సంఘం మండలాధ్యక్షుడు బాబు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భారతి మాట్లాడుతూ జొన్న, మొక్క జొన్న , పెసలు, అపరాలకు మద్దతు ధర లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరకు కొ నుగోలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు పంటలు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు, తమ్మా ప్రసాద్‌రెడ్డి, మాధవరెడ్డి, కోటేశ్వరి పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి టోపీలు అందజేత

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన జై భీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌విభాగంలో పని చేస్తున్న సిబ్బందికి టోపీలు(హ్యాట్‌లు), చలువ కళ్లద్దాలను అందజేశారు. స్థానిక టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఐ కె. రాములనాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని సిబ్బందికి వీటిని అందజేశారు. ఎండలో ట్రాఫిక్ విధులు నిర్వహించేవారు ఇబ్బందులు పడతారని, వారికి ఉపయోగంగా ఉండే హ్యాట్‌లు, చలువ కళ్లద్దాలు ఇవ్వడం అభినందనీయమని సీఐ పేర్కొన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొలవరపు దేవానంద్ మాట్లాడుతూ ట్రాఫిక్ విధుల్లో ఉన్న సిబ్బంది ఇబ్బందులను స్వయంగా చూసి వారికి ఉపశమనం కోసం వీటిని అందించినట్టు చెప్పారు. ట్రాఫిక ఎస్‌ఐ మైలా బ్రహ్మయ్య, సుద్దపల్లి. కనకరాజు, కొత్తపల్లి రామారావు, బాబు నాయక్, శివ, నాగరాజు తదితర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



టాఫిక్ సిబ్బందికి టోపీలు, కళ్ల జోళ్లు అందజేసిన జై భీమ్ ఫౌండేషన్ సభ్యులు

పారిశుధ్య కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

మంగళగిరి: పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు యర్రబాలెం , నవులూరు, నిడమర్రు, బేతపూడి సీఆర్‌డీఏ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాల్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం రవి, ఎం.భాగ్యరాజ్, ఓ రామారావు, టి.ఆదిలక్ష్మి, ఏడుకొండలు, శివకోటి, మేరీ, నాగమణి, శివనాగేంద్రం, పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు

తెనాలిటౌన్: శ్రీరామనవమి సందర్భంగా రూరల్ మండలం కొలవరం గ్రామంలోని శ్రీ విఘ్నేశ్వర రామసాయి మందిరంలో నిర్వహిస్తున్న 13వ శ్రీ సీతారామస్వామి వార్ల కళ్యాణ మహోత్సవం సోమవారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆలయం వద్ద స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని శ్రీ సీతారాములను దర్శించి స్వామి కృపకు పాత్రులయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.



అన్నసంతర్పణలో పాల్గొన్న ప్రజలు

చైన్ స్నాచింగ్‌పై ఫిర్యాదు

మంగళగిరి టౌన్: బస్‌లో ప్రయాణిస్తుండగా మెడలో చైన్ అపహరణకు గురైందని మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఓ విద్యార్థిని ఫిర్యాదు చేసింది. సేకరించిన వివరాల ప్రకారం .. తాడేపల్లి బ్రహ్మానందపురానికి చెందిన విద్యార్థిని తెనాలిలో ఓ కళాశాలలో ఫార్మాడి కోర్సు చదువుతోంది. సోమవారం ఉదయం మంగళగిరి బస్టాండ్‌లో తెనాలికి వెళ్లే బస్సును ఆ విద్యార్థిని ఎక్కింది. ఆంజనేయస్వామి గుడి బస్టాప్ వద్ద ఇద్దరు వ్యక్తులు మాస్క్ ధరించి బస్సు ఎక్కారని, వారు తనవైపే అనుమానంగా పలుమార్లు చూస్తున్నట్లు విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొంది. బస్సు దుగ్గిరాల మండలం మోరంపూడి దాటిన తరువాత చున్నీ సరిచేసుకుంటూ మెడవైపు తడమగా మెడలో ఉన్న బంగారపు గొలుసు కనిపించలేదని పేర్కొంది. బస్టాప్‌లో మాస్క్ వేసుకున్న ఇద్దరు వ్యక్తులు హడావుడిగా దిగిపోయారని వారి మీద అనుమానం వ్యక్తం చేసింది. గొలుసు సుమారు 20 గ్రాములు ఉంటుందని తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేసింది.

విజేతలకు బహుమతి ప్రదానం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు రెసిడెన్షియల్ పాఠశాలలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న పీవీ రాంబాబు నెక్ బిడీసీ షటిల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. విజేతలకు టోర్నమెంట్ నిర్వాహకులు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు శ్రీకాంత్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా నెక్ బిడీసీ షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికి తోడు ఇటీవల మృతి చెందిన కొత్త ఐజక్‌శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీవీ రాంబాబు స్మారకంగా జూనియర్, సీనియర్స్ విభాగంలో తెనాలి పరిసర ప్రాంత క్రీడాకారులకు టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలిపారు. క్రీడాకారులు ప్రదర్శించిన క్రీడ స్ఫూర్తి అభినందనీయమని కొనియాడారు. జూనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా సంజు, అనిల్ రన్నర్స్‌గా అనురూప్ నోయల్, రాజేష్ గెలుపొందినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్.వినయ్‌కుమార్, కె.జార్జీ థామస్, నరిశెట్టి మహేష్, బివిఆర్, పీటర్‌పాల్, గల్లా సతీష్, పి.ధీరజ్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేసిన టోర్నమెంట్ నిర్వాహకులు

డొంకరోడ్ల అభివృద్ధికి కృషి

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని పొలాలకు వెళ్లే డొంకరోడ్ల అభివృద్ధి కృషిచేస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోనిరేపూడి గ్రామ శివారులోని పొలాలకు వెళ్లే డొంక రోడ్లు ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను సోమవారం పరిశీలించారు. అయన మాట్లాడుతూ గ్రామాల్లో పొలాలకు వెళ్లే రోడ్డుపై గుంతలు పూడ్చివేత, రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ పథకం ద్వారా వేసవిలో కూలీలకు పనులు ప్రభుత్వం పనులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏపీవో కిరణ్మయి, సర్పంచ్ చిట్టా అంజనీదేవి, చిట్టా అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వర్ణలతలు పాల్గొన్నారు.

5 శాతం చెల్లించి రాయితీ పొందండి

తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. భవన యాజమానులు ఒకేసారి ఏడాది పన్నును చెల్లిస్తే 5 శాతం రాయితీ లభిస్తుందన్నారు. తెనాలి పట్టణ పరిధిలోని భవన యాజమానులందరూ తమ ఇంటి పన్నులను ఈ నెల 30వ తేదీ లోపు చెల్లించి రాయితీని పొందాలని సూచించారు.



పన్ను చెల్లించేందుకు క్యూలో ఉన్న పట్టణవాసులు

టీసీఎస్‌లో ఉద్యోగాలకు 11 మంది ఏఎస్‌ఎన్ విద్యార్థులు

తెనాలి: ప్రముఖ ఐటీ కంపెనీ టీసీఎస్ సంస్థ టీసీఎస్–బీపీఎస్ విభాగానికి స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజి ఫైనలియర్ బీకాం విద్యార్థులు 11 మంది ఎంపికయ్యారు. టీసీఎస్ నిర్వహించిన నేషనల్ క్వాలిఫై టెస్ట్‌లో నెగ్గి, తర్వాత జరిగిన రెండు విభాగాల ఇంటర్వ్యూలతో 11 మంది విద్యార్థులు టీసీఎస్ నుంచి నియామక పత్రాలను అందుకున్నట్టు ఏఎస్‌ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. డిగ్రీ కాలేజిలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు వార్షికవేతనం రూ.2.4 లక్షలుగా తెలిపారు. ఈ ఎంపికలతో కలిపి 2024–25 విద్యాసంవత్సరంలో తమ కాలేజిలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 92 శాతం మందికి ఉద్యోగాలు లభించాయని శివకుమార్ చెప్పారు. మిగిలిన విద్యార్థులకు కూడా తగిన అవకాశాలు లభిస్తాయన్న ఆశాభావం వ్యక్తంచేశారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ కాలేజిలో నిర్వహిస్తున్న జీవన కళల శిక్షణ, వివిధ సంస్థలతో ఎంవోయూలతో చేస్తున్న సర్టిఫికెట్ కోర్సులతో ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఎంపికైన విద్యార్థులు వారు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్

అక్రమ అడ్మిషన్లు నిలిపివేయాలి

ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్

తెనాలిఅర్బన్: నియోజకవర్గ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులను, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ ఆరోపించారు. గాంధీనగర్‌లోని ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వేసవి సెలవులను ప్రకటించినప్పటికీ కొన్ని విద్యాసంస్థల వారు తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి అలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ, పట్టణ కార్యదర్శి చెన్నూరి సాయి, నాయకులు పాశం చెక్కిరి, షేక్ పండు, మద్దినేని బాబు, దాసరి ఇర్మియా, పవన్, కొట్లు గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్

రోడ్లు, కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: ఒకటోవ వార్డులో నూతన కాల్వలు, రెండోవ వార్డులో నూతన రోడ్డును నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఒకటి, రెండు వార్డులకు చెందిన పలువురు వీటిపై అర్జీలు ఇచ్చారు. అలాగే 13వ వార్డులోని ఆర్టీసీ డిపో స్థలంలో ఎగ్జిబిషన్ ఏర్పా టు చేస్తున్నారని, దీనివలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, దాని అనుమతులు వెంటనే రద్దు చేయాలని మాజీ కౌన్సిలర్ హరిదాసు గౌరీశంకర్ కోరారు. అలాగే 30వ వార్డులో ఖాళీ స్థలాల్లో ఉన్న పిచ్చి చెట్లు తొలగించాలని కౌన్సిలర్ కోమరబత్తుని జయపాల్ ఆ ప్రాంతవాసి గుమ్మడి నారాయణను కోరారు. వీటన్నింటినీ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావుకు వినతిపత్రం ఇస్తున్న మాజీ కౌన్సిలర్ గౌరీ శంకర్

నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు జరపండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలు జరపాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లు, బిల్డర్స్‌తో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన నిబంధనల వలన తమ లైసెన్స్‌లు కొంతకాలం రద్దు అయ్యే అవకాశం ఉందని, దానిని సవరించాలని, లైసెన్స్‌డ్ సర్వేయర్లు అధికారులను కోరారు. అలాగే గతంలో వలే 4,5 ఫ్లోర్లకు అనుమతించాలని పలువురు బిల్డర్స్ కోరారు. ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులతో మాట్లాడి వారి నిర్ణయాన్ని తెలియజేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఏసీపీలు శ్రీమన్నారాయణ, వి.వాణి, టీపీవో సాంబశివరావు, పలు టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తెనాలిటౌన్: క్షేత్రస్థాయిలో భారతీయ జనతాపార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని ముఖ్యనేతలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు సూచించారు. సోమవారం స్థానిక బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో పార్టీ ముఖ్యనేతల సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిధిగా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, నాయకులు కె.వాసుదేవనాయుడు, అడపా సంపత్‌రాయుడు, మైలా హరికృష్ణ, టి.అనంతాచార్యులు, ఎం.రత్నరాజు, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై 12 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో 12 అర్జీలు వచ్చాయి. వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన ప్రజల నుంచి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి నాలుగు, వైద్య, ఆరోగ్యశాఖ, బీసీ సంక్షేమం, గృహనిర్మాణ సంస్థ, మున్సిపాలిటీకి సంబంధించిన అర్జీలు ఒక్కోటి చొప్పున వచ్చాయి. పంచాయతీ రాజ్‌కు చెందిన అర్జీ ఒకటి, సీనియర్ సిటిజన్ సమస్యపై మరొక అర్జీ వచ్చాయి. అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ తెలియజేశారు.

భక్తులకు అన్నదానం

తెనాలిటౌన్: స్థానిక బాలాజీరావుపేట అయ్యప్పపురం ప్రధాన అయ్యప్ప దేవాలయంలో సోమవారం శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, కమిటీ నిర్వాహకులు దుర్భ హరి బాబుశర్మ పాల్గొని శ్రీరామ పట్టాభిషేకం, వ్రతం, అన్నసంతర్పణ కార్యక్రమాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.